

కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు



నరసారెడ్డిని సత్కరిస్తున్న సాలూరి వాసూరావు

# చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోండి

**కెన్సెస్ అధినేత నరసారెడ్డి ● కేసరిలో ఘనంగా బాలల దినోత్సవం**

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కెన్సెస్ గ్రూపుల అధినేత కె.నరసారెడ్డి పిలుపునిచ్చారు. టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భాగ్యనగర్‌కు చెందిన విద్యావేత్త, కవి, రచయిత టీవీ స్వామి కలం నుంచి జాలువారిన బాలల గేయాలు ఆడియో ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ సినీ సంగీత దర్శకులు బాలల గేయాల స్వరకర్త సాలూరి వాసూరావు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా కెన్సెస్ గ్రూపుల అధినేత నరసారెడ్డి, పాఠశాల కార్యనిర్వాహక సభ్యులు ఎం.శ్రీరామ్ ప్రసాద్, కార్యదర్శి కేఎస్వీ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య, శ్రీవేణుగోపాల విద్యాలయ ఛైర్మన్ కె.అనిల్‌కుమార్ రెడ్డి, ప్రముఖ సినీ గాయకులు రవిశంకర్, సావిత్రి శివకుమార్ సహా తెలుగు ప్రముఖులు బీఎస్వీ కృష్ణ, సుభద్ర, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ వేడుకలకు పూర్వ విద్యార్థి సీహెచ్ మదన్‌మోహన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ... ప్రముఖ సంగీత దిగ్గజం దివంగత రాజేశ్వరరావు తనయుడు సాలూరు వాసూరావు విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి అధిగమించి నూతన ఉల్లాసం, ఉత్తేజం పెంపొందింపజేయాలన్నా సంకల్పంతో బాలల గేయాల ఆడియో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి గేయాలు బాలబాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేసి, జీవితంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించేందుకు దోహదపడతాయన్నారు.

**ఆటపాటలతో సాగేదే విద్య - వాసూరావు**

ఆటపాటలతో సాగేదే విద్య అని సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు పేర్కొన్నారు. ఈ పాఠశాలలోనే చదువుకుని సంగీత నేపథ్య కుటుంబంలో జన్మించం అదృష్టమయితే, తనవంతుగా ఈ రోజు టీవీస్వామి రూపొందించిన బాలల గేయాలకు స్వరకల్పన చేయడం, అది కూడా తాను ఓనమాలు నేర్చుకున్న పాఠశాలలో జరగడం గర్వంగా ఉందన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు పాటిస్తున్న క్రమశిక్షణ, విధేయత వల్ల పలువురు ప్రముఖులు సాయం చేయడానికి ముందుకొస్తున్నారని చెప్పారు. గత 12 యేళ్లుగా కెన్సెస్ అధినేత నరసారెడ్డి అల్పాహారం అందజేస్తున్నారని, అలాగే వాసూరావు కూడా బాలల దినోత్సవం సందర్భంగా మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగులో చదువుకుని తాను కవితలు, సాహిత్యంపై ఎక్కువ శ్రద్ధ చూపానని, విద్యార్థులు చందస్సు, పద్యాలు చక్కగా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం టీవీ స్వామి తన స్పందనలో చెన్నై మహానగరంలో ఈ కార్యక్రమం చేయడంపై మొదట్లో కొంచెం సంశయాన్నిచ్చినప్పటికీ బాలబాలికలతో ఉత్సాహంగా ఆద్యంతం కార్యక్రమాన్ని తిలకించడం తనను పులకరింపజేసిందన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులందరినీ వాసూరావు శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు.

## శ్రీరంగంలో 'ముక్కోటి' ఉత్సవాలకు శ్రీకారం

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూలోక వైకుంఠంగా, అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ప్రథమ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి వేడుకలకు సిద్ధమవుతోంది. గురువారం ఆ వేడుకల కోసం శుభముహూర్త స్తంభస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలో ఈ యేడాది వైకుంఠ ఏకాదశి వేడుకలు డిసెంబర్ 30న తిరునెడ తాండకంతో ప్రారంభమై, జనవరి 20 వరకు కొనసాగనున్నాయి. డిసెంబర్ 31న పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జనవరి తొమ్మిదిన స్వామివారికి మోహినీ అలంకార వైభవం, 10న ముఖ్య ఘట్టమైన స్వర్గద్వార ప్రవేశం జరుగనుంది.



జనవరి 16న తిరుకైత్తల్ సేవ, 17న తిరుమంగై మన్నన్ వేటపరి ఉత్సవం, 19న తీర్థవారీ, 20న నమ్మాళ్వార్ మోక్షం జరుగుతాయి. ఈ వైకుంఠ ఏకాదశి వేడుకలకు శ్రీకారం చుట్టేలా గురువారం ఉదయం రంగనాథస్వామి ఆలయంలోని వెయ్యికాళ్ల మంటపం వద్ద శుభమూహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఏనుగు 'ఆండాళ్'ను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆ తర్వాత పవిత్ర స్తంభాన్ని శుభ్రపరచి, మామిడాకులను పసుపువస్త్రంతో కటి ప్రతిష్ఠించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్, ఆలయ ప్రధానార్చకులు, కార్మికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. స్తంభస్థాపన అనంతరం ఆ ప్రాంగణం వద్ద భారీ పందిరి నిర్మించే పనులు ప్రారంభమయ్యాయి.

# పిల్లలకు తమిళంలో పేర్లు పెట్టండి

- డిప్యూటీ సీఎం ఉదయనిధి వినతి
- తూత్తుకుడిలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం



లబ్ధిదారులకు వాహనాలు పంపిణీ చేస్తున్న ఉదయనిధి

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు తమిళంలో పేర్లు పెట్టాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. గురువారం తూత్తుకుడి జిల్లా పర్యటన కోసం ఆయన బుధవారం సాయంత్రం విమానంలో తూత్తుక్కుడి చేరుకుని, రాత్రి అక్కడే బస చేశారు. ఆ తర్వాత గురువారం జిల్లాలో అధికారులు ఏర్పాటు చేసిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆదర్శ వివాహాలను ద్రావిడ సంస్థలు ప్రోత్సహించాయని, అప్పటి నుంచి ఈ వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఆలయాల్లో కూడా తమిళంలో అర్చన చేయాలని ద్రావిడ సంస్థలు ఒత్తిడి చేయడం వల్లే అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ఆస్తి హక్కులో సమాన వాటా కల్పించింది కూడా తమ పార్టీయేనని చెప్పారు. తల్లిదండ్రులకు ఆయన ఒక విజ్ఞప్తి చేశారు. తమ పిల్లలకు తమిళంలో పేర్లు పెట్టాలని, ప్రతి ఒక్కరూ ఈ పని చేస్తే ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. అనంతరం తూత్తుకుడి తహ సీల్దార్ కార్యాలయంలో ఉదయనిధి తని ఖీలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ పథకాలపై సమీక్ష జరిపారు. రూ.206.46 కోట్ల విలువైన సహాయాలను లబ్ధి దారులకు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు గీతాజీవన్, అనిత ఆర్.రాధాకృష్ణన్, ఎమ్మెల్యేలు మార్కండేయన్, షణ్ముగయ్య, ఊర్వశి, అమృతరాజ్, కార్పొరేషన్ మేయర్ జగన్ పెరియస్వామి, స్పెషల్ స్కీమ్స్ సెక్రటరీ థారేస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.





డాక్టర్ బాలాజీని పరామర్శిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పార్థసారథి తదితరులు - బాలాజీని పరామర్శిస్తున్న మాజీ గవర్నర్ తమిళిసై

# ఆస్పత్రుల వద్ద అవుట్ పోస్టులు, సీసీ కెమెరాలు

**మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు ● మంత్రి సుబ్రమణ్యం**

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రుల వద్ద పోలీసు ఔట్‌పోస్టులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఆస్పత్రులకు వచ్చే అందరిని తనిఖీ చేసేలా ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు కూడా అమర్చనున్నామని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. గురువారం గిండి ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతున్న డాక్టర్ బాలాజీ జగన్నాథన్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. విఘ్నేష్ అనే యువకుడు కత్తితో జరిపిన దాడిలో గాయపడిన డాక్టర్ బాలాజీ ప్రస్తుతం కోలుకున్నారని, ప్రాణాపాయం నుండి బయటపడ్డారని తెలిపారు. డాక్టర్ బాలాజీకి పేస్‌మేకర్ అమర్చి ఉండటంతో దానికి సంబంధించి నిపుణులను రప్పించి వాటి పనితీరు కూడా పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం స్పెషల్ వార్డులో ఉన్న డాక్టర్ బాలాజీని తాను పరామర్శించినప్పుడు ఇంకా అయిదేళ్ల సర్వీసు ఉందని, గిండి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోనే పనిచేసి రిటైర్ కావాలని కోరుకుంటున్నట్లు తనతో నవ్వుతూ తెలిపారని మంత్రి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆ విషయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోన్‌లో పరామర్శించినప్పుడు కూడా డాక్టర్ బాలాజీ వెల్లడించారని చెప్పారు.

**విఘ్నేష్‌పై 7 సెక్షన్ల కింద కేసులు...**

డాక్టర్ బాలాజీపై కత్తితో దాడి జరిపిన విఘ్నేష్‌పై హత్యాయత్నం, ప్రభుత్వోద్యోగిపై దాడి తదితర 7సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని వివరించారు. గిండి ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు భవిష్యత్తులో ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనూ జరగకుండా ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు ప్రారంభించిందన్నారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న 37ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రులు, 37 జిల్లా ప్రధాన ఆస్పత్రుల వద్ద పోలీసు ఔట్‌పోస్టులు, సీసీ కెమెరాలు, మెటల్ డిటెక్టర్లు కూడా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. నిందితుడు విఘ్నేష్ చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని, నిజానికి అతడి తల్లి క్యాన్సర్ బాగా ముదిరిన తర్వాతే ఆస్పత్రిలో చేర్పించాడని మంత్రి వివరణ ఇచ్చారు.



చెన్నై నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల డీన్‌లతో సమీక్ష జరుపుతున్న మంత్రి సుబ్రమణ్యం

**డీన్‌లతో సమీక్ష...**

ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రుల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలు గురించి మంత్రి సుబ్రమణ్యం గురువారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల డీన్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్పత్రులకు వచ్చే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే లోపలకు అనుమతించాలని ఆదేశించారు. పోలీసులతోపాటు ప్రైవేటు భద్రతా సిబ్బంది సంఖ్య కూడా అవసరమైతే పెంచాలని కూడా ఉత్తర్వు జారీ చేశారు.

**ప్రభుత్వ పాఠశాలలో మంత్రుల ఆకస్మిక తనిఖీ**

6లో..

**మే 1న 'కూలీ' విడుదల?**

7లో..



# గిండి ఆస్పత్రి ఘటనపై వైద్యుల ఆందోళన

**రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించిన డాక్టర్లు**



రాజీవ్‌గాంధీ స్మారక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిండి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ బాలాజీపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు ఆందోళన చేశారు. రాష్ట్రంలో 7900లకు పైగా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులున్నాయి. వీటిలో సుమారు 45 వేలమంది వరకు వైద్యులు పనిచేస్తున్నారు. వారికి నాలుగు ప్రధాన సంఘాలున్నాయి. వీటిలో రెండు సంఘాలు సమ్మె యోచన విరమించుకోగా, తక్కిన రెండు సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. గిండి ఆస్పత్రి డాక్టర్‌పై దాడి జరిగిన వెంటనే ప్రైవేటు వైద్యుల సంఘాల సమ్మెకు దిగాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం రాష్ట్రంలోని ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

**నగరంలో... :**

నగరంలోని గిండి, స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద వైద్యులు ధర్నా జరిపారు. గిండి ఆస్పత్రి ఎదుట జరిగిన వైద్యులు ధర్నాలో డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ బాలాజీని పరామర్శించారు. ఇదే విధంగా రాజీవ్‌గాంధీ స్మారక ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీహెచ్) వద్ద కూడా వైద్యులు ధర్నా జరిపారు.

**ఈరోడ్‌లో.. :**

జిల్లా కేంద్రం ఈరోడ్‌లో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు ధర్నా జరిపారు. ఇదేవిధంగా సేలం ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు పాత డీన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకుడు సెంథిల్‌కుమార్ నేతృత్వంలో ధర్నా జరిపారు. నామక్కల్ జిల్లా తిరుచెంగోడు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్యుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ అరుళ్ నేతృత్వంలో వైద్యులు, దిండుగల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో వైద్యులు ఆందోళన చేశారు.



గిండి ఆస్పత్రి వద్ద వైద్యులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న డీఎండీకే నాయకురాలు ప్రేమలత

# బలహీనపడిన అల్పపీడనం

- అయినా తేలికపాటి వర్షం
- నేడు 18 జిల్లాలకు అలెర్ట్

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల 12వ తేదీ ఏర్పడి స్థిరంగా కొనసాగుతున్న అల్పపీడనం బలహీనపడింది. అయినప్పటికీ ఉత్తర తమిళనాడు కోస్తాతీరం నైరుతి బంగాళాఖాతంలో చెన్నైకి సమీపంలో బాహ్య ఉపరితల ఆవర్తన ద్రోణి నెలకొంది. ఈ కారణంగా తిరువళ్లూరు, వేలూరు, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయనివాతావారణ కేంద్రం తెలిపింది. కేరళ సముద్రతీర ప్రాంతానికి సమీపంలో ఆగ్నేయ అరేబియా సముద్రంలో బాహ్య ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పుదుచ్చేరి, కారైక్కాల్‌లో తేలికపాటి వర్షాలు కురిశాయి. గురువారం చెంగల్పట్టు, కాంచీపురం, కళ్ళకుర్చి, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తంజావూరు, తిరువారూర్, అరియలూరు, పెరంబలూరు, పుదుక్కోట, శివగంగై, మదురై, విరుదునగర్, తెన్‌కాశి, రామనాథపురం, తేని, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్నియాకుమారి, రామనాథపురం, శివగంగై, నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూరు తదితర ప్రాంతాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఈ నెల 15న పైన పేర్కొన్న జిలాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. 16వ తేదీన నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూరు, తేని, దిండిగల్ జిల్లాల సహా చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తుందని ఐఎండీ అధికారులు తెలిపారు.

చెన్నైలో తగ్గిన వర్షపాతం : చెన్నై నగరంలో బుధవారం భారీ వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కానీ, కనిష్ఠంగా కూడా వర్షం పడలేదు. దీనికి గల కారణాలను వాతావరణ నిపుణులు వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడటం, కొత్తగా మరో రెండు అల్పపీడనాలు నాగపట్టణం, చెన్నైల సమీపంలో ఏర్పడ్డాని వీటి కారణంగా చెన్నై నగరంలో ఆశించిన స్థాయిలో వర్షం పడలేదని తెలిపారు. అలాగే, చెన్నైకు ఉత్తరంగా ఉన్న తిరువళ్ళూరు, రాణిపేట, ఏపీలోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిశాయని తెలిపారు. ఈ వాయుగుండం తన స్థానాన్ని మార్చుకుంటుందని అందువల్ల చెన్నైలో శుక్రవారం వర్షం కురిసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

## సమాచార దర్శిని

### పోలీసుల వారసులకు స్టయిఫండ్

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు, ఆ శాఖ సిబ్బంది వారసులకు స్టయిఫండ్ తీసుకునేందుకు డిసెంబరు 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని డీజీపీ శంకర్ జివాల్ సూచించారు. డిగ్రీ, పీజీ, టెక్నికల్ ఎడ్యుకేషన్, ఉన్నత విద్య చదివే పోలీసుల వారసులు.. ఈ అకడమిక్ సంవత్సరంలో స్టయిఫండ్ పొందాలనుకుంటే డిసెంబరు 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పోలీసుల పేస్లిప్, ప్లస్‌టూ మార్కుల జాబితా, బ్యాంక్ పాస్‌బుక్ జెరాక్స్ కాపీని జత చేసి, తన కార్యాలయానికి దరఖాస్తు పంపించాలని డీజీపీ సూచించారు.

### అంబేడ్కర్ బిరుదుకు దరఖాస్తులాహ్వానం

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజనాభివృద్ధి కోసం ప్రత్యేకంగా సేవలందించినవారికి తమిళనాడు ప్రభుత్వం ప్రతి ఏటా తిరువళ్లువర్ జయంతిరోజు అంబేడ్కర్ పేరుతో బిరుదు ప్రదానం చేసి సత్కరిస్తున్న విషయం తెలిసిందే. ఆ మేరకు 2025 సంవత్సరానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది. కలెక్టరేట్‌లోని ఆదిద్రావిడ, గిరిజనాభివృద్ధి విభాగంలో దరఖాస్తు తీసుకుని, సమర్పించాల్సివుంటుంది. వివరాలకు 7338801253, 9841470798 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

### శబరియాత్రకు ప్రత్యేక రైళ్ళు

**16 నుంచి చెన్నై - కొల్లం మధ్య ప్రారంభం**

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం చెన్నై - కొల్లం మధ్య దక్షిణ రైల్వే నాలుగు ప్రత్యేక రైళ్ళను నడుపనుంది. ఈ నెల 19 నుంచి నడుపనున్నట్టు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ రైళ్ళు చెన్నై సెంట్రల్ నుంచి ఈ నెల 19 నుంచి జనవరి 14వ తేదీ వరకు నడుపనున్నారు. ప్రతి మంగళవారం రాత్రి 11.20కి చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నవంబరు 20 నుంచి జనవరి 15వ తేదీ వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.30కి కొల్లంలో బయలుదేరి మరుసటి రోజు పగలు 11.35 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది ఈ రైలు కాకుండా చెన్నై సెంట్రల్ - కొల్లం మధ్య మరో రెండు వారాంతపు రైళ్ళను, ఒక గరీబ్ రథ్ రైలు నడుపనున్నారు. ఈ మూడు రైళ్ళు ఈ మార్గంలో 9 ట్రిప్పుల పాటు తిరుగనున్నాయి. అయితే, ఈ మూడు రైళ్ళుబయలుదేరే రోజులు, సమయం తదితర వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

### నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నగర శివారులోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్‌శాఖాధికారులు ప్రకటన విడుదల చేశారు. ఆయా ప్రాంతాల వివరాలిలా... ఈంజంబాక్కం, నయనార్ కుప్పం, మీనాక్షి పడివం, వీజీపీ ప్రాంతం, రఘువరతోట, రంగనాథన్ అవెన్యూ, జూహూ బీచ్, రాజన్ రోడ్డు, కేకేఆర్ పడివం, అరుణా పడివం, ఐఎంయూహెచ్‌టీ సర్వీస్, రాగాస్ డెంటల్ కాలేజ్, ఈడెన్ గార్డెన్, పీవీఆర్ సినిమాస్, ఉద్దండి గ్రామం, పాలమ్స్ స్ప్రింగ్, రాజీవ్‌గాంధీ నగర్, సెంగోద్రై అమ్మన్ కోవిల్ వీధి, పిడారియమ్మన్ కోయిల్ వీధి, భజనై కోయిల్ వీధి, సెంగోనియమ్మన్ కోయిల్ వీధి, కన్నభిరాన్ కోయిల్ వీధి, తండుమారియమ్మన్ కోయిల్ వీధి, వీరభద్రన్ కోయిల్ వీధి.

### ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల బదిలీలకు అవకాశం

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సుదీర్ఘకాలంగా పని చేస్తూ, బదిలీల కోసం ఎదురు చూస్తున్న అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. వారు కోరుకుంటున్న ప్రాంతాల బదిలీ కోసం ఈ నెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సివుంటుందని సాంకేతిక విద్యావిభాగ డైరెక్టర్ టి.అబ్రహం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ప్రిన్సిపాళ్లకు లేఖ పంపించారు. ఉన్నతవిద్యాశాఖ సూచనల మేరకు 2024-25 అకడమీ సంవత్సరంలో పని చేస్తూ బదిలీలు కోరుతున్న అధ్యాపకులు ఉన్నత విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సివుంటుంది. ఏఏ కాలేజీల్లో ఖాళీలున్నాయన్న వివరాలను కూడా ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఆయన వివరించారు.

### మదురైలో ఒలింపిక్ పోటీలు...!

పెరంబూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఒలింపిక్ అకాడమీ నిర్మాణాలకు వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఈ అకాడమీలో కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వాలీ బాల్ మైదానాలు సహా పలు అత్యాధునిక వసతులు ఏర్పాటుచేయనున్నామన్నారు. ఒలింపిక్ పోటీలు మదురైలో నిర్వహించే ఆలోచన ఉన్నట్లు మంత్రి తెలిపారు.

### అగర్వాల్ కంటి ఆస్పత్రిలో మధుమేహ రోగులకు రాయితీ

చెన్నై, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినాన్ని పురస్కరించుకుని నగరంలోని డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రిలో మధుమేహబాధితులకు కన్సల్టేషన్స్ రుసుము లేకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.50 యేళ్లకు పైబడిన మధుమేహ బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి క్లినికల్ హెడ్ డాక్టర్ మనోజ్ ఖాత్రీ తెలిపారు. ఈ రాయతీతో కూడిన కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాల నుకునే వారు 9594924098 అనే నెంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలపై మంత్రుల ఆరా

● కొళత్తూరులో ఘనంగా బాలల దినోత్సవం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న మంత్రులు అన్బిల్ మహేష్, శేఖర్‌బాబు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూరు ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని జీకేఎం కాలనీలో ప్రభుత్వ మోడల్ హైస్కూల్ ఉంది. ఈ పాఠశాలలో మంత్రి మహేశ్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఐఏ టెక్నాలజీ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతిక సాయంతో విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్స్ యంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేశ్‌తో పాటు దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, నగర మేయర్ ఆర్.ప్రియ ఇతర ఉన్నతాధికారులున్నారు. ఈ సందర్భంగా మంత్రి మహేశ్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో 2022 సంవత్సరం అక్టోబరు నెలలో ప్రారంభించిన ఈ తనిఖీలను 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తి చేసినట్టు తెలిపారు. రెండేళ్ళ తర్వాత 234వ నియోజకవర్గంగా కొళత్తూరు వచ్చినట్టు పేర్కొన్నారు. తన సమీక్ష ముగింపు రోజు బాలల దినోత్సవం కావడం యాదృచ్ఛికమన్నారు. ఇదిలా వుండగా ఈ పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవానికి హాజరైన మంత్రులు.. చిన్నారులకు బహుమతులు అందజేశారు.

## పోలీసు వాహనంలో మద్యం తాగిన ఎస్సై సస్పెన్షన్



పోలీసు వాహనంలో మఫ్టీలో మద్యం తాగుతున్న ఎస్సై లింగేశ్వరన్

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనంలో మద్యం తాగిన స్పెషల్ ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు పడింది. ఖైదీలను తరలించే పోలీసు వ్యాన్‌లో యూనిఫాం లేకుండా దర్జాగా ఆ ఎస్‌ఐ మద్యం తాగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పరంగిమలై సాయుధదళంలో ప్రత్యేక ఎస్సైగా లింగేశ్వరన్ పనిచేస్తున్నారు. ఇటీవల ఓ ఖైదీని ఆయన వ్యాన్‌లో జైలుకు తీసుకెళ్ళారు. ఆ తర్వాత ఆ వ్యాన్‌లో తిరిగి వెళ్తూ మద్యం సేవించారు. ఈ దృశ్యంతో కూడిన వీడియో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక ప్రసార మాధ్యమాల్లో వెలువడ్డాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఆ వీడియో ఆధారంగా విచారణ జరపగా లింగేశ్వరన్ మఫ్టీలో పోలీసు వ్యాన్‌లో మద్యం తాగినట్లు రుజువైంది. దీంతో లింగేశ్వరన్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రభుత్వ పథకాలపై ఫొటో ప్రదర్శన



వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కేపీ కుప్పం తాలూకా వేలం పంచాయతీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కలిగించేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటైంది. ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, వేలూరు ఎంపీ కదిర్ ఆనందన్ తదితరులు ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు.

## డీఎంకే పోలింగ్ బూత్ ఏజెంట్ల భేటీ



వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా ఆనైకట్టు శాసనసభ నియోజకవర్గ ఆనైకట్టు కేంద్ర యనియన్ డీఎంకే పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశం గురువారం జరిగింది. యూనియన్ కార్యదర్శి వెంకటేశన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి డీఎంకే ఎమ్మెల్యే నందకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బాబు, ఆనైకట్టు యూనియన్ కార్యదర్శి కుమారపాండ్యన్, డీఎంకే ఎన్నికల ఇన్‌చార్జ్ మధుసూధనన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## లాటరీ వ్యాపారి మార్టిన్, బంధువుల ఇళ్లల్లో ఈడీ తనిఖీలు



మార్టిన్

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ లాటరీ వ్యాపారి మార్టిన్, ఆయన భార్య లీమారోస్, అల్లుడు, డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్‌కు చెందిన నివాసాలు కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీ జరిపారు. ఒకే సమయంలో చెన్నై, కోవై నగరాల్లో ఈ సోదాలు జరిగాయి. గురువారం ఉదయం చెన్నై పోయెస్‌గార్డెన్‌లో ఉన్న మార్టిన్ ఇల్లు, టి.నగర్‌లో ఉన్న ఆయన కార్యాలయం, ఆయన కుమారుడు చార్లెస్ నివాసం, ఆయనకు చెందిన సంస్థలో ఈ తనిఖీలు జరిగాయి. అదే విధంగా తేనాంపేట కస్తూరిరంగన్ వీధిలోని మార్టిన్ అల్లుడు, డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్ నివాసం, కోయంబత్తూరు తుడియలూరులోని మార్టిన్ నివాసగృహం, కార్యాలయం, ఆయనకు చెందిన మార్టిన్ హోమియోపతి వైద్యకళాశాలలో ఒకే సమయంలో ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 2012 మార్చిలో నంగనల్లూరుకు చెందిన నాగరాజన్ అనే వ్యక్తి నివాసగృహంలో కేంద్ర ఆర్థిక నిఘా విభాగం పోలీసుల తనిఖీల్లో రూ.7.20కోట్ల మేర నగదు పట్టుబడింది. దీనికి సంబంధించి జరిపిన విచారణలో ఆ నగదు లాటరీ వ్యాపారి మార్టిన్ తదితరులతో కలిసి కేరళ, మహారాష్ట్రలో లాటరీ టికెట్ల విక్రయాల ద్వారా సంపాదించినట్లు నాగరాజన్ వాంగ్మూలం ఇచ్చాడు. దీనితో నాగరాజన్, మార్టిన్, ఆయన సతీమణి లీమారోస్ తదితరులపై కేసులు నమోదు చేశారు. ఆ నేపథ్యంలోనే ఈడీ అధికారులు అక్రమ నగదు బట్వాడా కేసు నమోదు చేసి తనిఖీలు జరిపారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగం భద్రతతో ఈడీ అధికారులు ఈ తనిఖీలు జరిపారు.

## అస్పత్రిలో చేరిన వైగో

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో గురువారం ఉదయం థౌజండ్‌లైట్‌లోని అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయన ఎడమభుజానికి అమర్చిన టైటానియం ప్లేట ఆపరేషన్ ద్వారా తొలగించేందుకు ఆస్పత్రిలో చేరినట్టు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. గత మే నెలలో ఆయన జారిపడటంతో ఎడమ చేయి భుజానికి ఆపరేషన్ చేసి, టైటానియం ప్లేట్లు అమర్చారు. అప్పటి నుంచి ఆయన ఇంటిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. అతి ముఖ్యమైన పార్టీ కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఎడమ భుజానికి అమర్చిన ప్లేట్లను తొలగించాలని వైద్యులు సూచించడంతో ఆయన ఆస్పత్రిలో చేరినట్టు తెలుస్తోంది.

## బాలల సంక్షేమంపై ర్యాలీ





వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరులో గురువారం చిన్నారులు నిర్వహించారు. చిన్నారుల సంక్షేమం, భద్రతపై అవగాహన కల్పించేలా ప్లకార్డులు చేతబూని 1500 మంది చిన్నారులు సత్తువాచారిలోని కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి ఈ ర్యాలీని ప్రారంభించగా, జిల్లా సంక్షేమశాఖాధికారి సంజీవ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## చిదంబరం ఆలయంలో కొత్త ధ్వజస్తంభం

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరం నటరాజ స్వామి ఆలయంలో శిథిలమైన పాత ధ్వజస్తంభాన్ని తొలగించి కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుచేయనున్నట్లు దేవాదాయ శాఖ మద్రాసు హైకోర్టులో హామీ ఇచ్చింది. ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్న తిల్లై గోవిందరాజర్ సన్నిధిలోని ధ్వజస్తంభాన్ని తొలగించి కొత్త ధ్వజస్తంభం ఏర్పాటును వ్యతిరేకిస్తూ హరిహరన్ అనే భక్తుడు హైకోర్టులో కేసు వేశారు. అందులో ధ్వజస్తంభం వ్యవహారంలో వైష్ణవులు, శైవుల మధ్య 1860వ సంవత్సరం విభేధాలు ఏర్పడిన కారణంగా ధ్వజస్తంభానికి అలంకారం, పూజలు, బ్రహ్మోత్సవాలు జరుపరాదని చిదంబరం న్యాయస్థానం తీర్పునిచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. అయితే ఈ తీర్పు ఉల్లంఘించి దేవాదాయ శాఖ కొత్త ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు స్టే విధించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్, న్యాయమూర్తి సెంథిల్‌కుమార్‌రామమూర్తిలతో కూడిన ప్రథమ ధర్మాసనం సమక్షంలో ఈ కేసు విచారణకు వచ్చింది. దేవాదాయ శాఖ తరపు న్యాయవాది, ఆలయంలో ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించి కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుచేయనున్నట్లు హామీ ఇచ్చారు. దీనిపై వారం రోజుల్లో రాత పూర్వకంగా నివేదిక దాఖలుచేయాలని ఆదేశించిన న్యాయస్థానం, తేది ప్రకటించకుండా విచారణ వాయిదావేసింది.

## రేషన్ దుకాణాల్లో గోధుమల పంపిణీ

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రేషన్ షాపుల్లో బియ్యం కార్డున్న వారికి తగినన్ని గోధుమలను అందించనున్నారు. గతంలో చెన్నై, లేదా జిల్లా కేంద్రాల్లో కార్డుపై నెలకు 10 కిలోలు, మిగిలిన ప్రాంతాల వారికి 5 కిలోల గోధుమలు ఇచ్చేవారు. దీనికి సంబంధించిన గోధుమల్ని కేంద్రప్రభుత్వం అందిస్తోంది. అయితే గత ఏడాది కేంద్రప్రభుత్వం గోధుమలను ఇవ్వలేకపోయింది. కొన్నిమార్లు కేవలం నెలకు 8,100 టన్నులు మాత్రమే పంపించింది. ఇందువల్ల కార్డుదారులకు నిల్వను బట్టి గోధుమలను పంపిణీ చేశారు. దీంతో అనేకమందికి గోధుమలు దొరకలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు చేపట్టి, కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరిపింది. దాంతో రాష్ట్రానికి నెలకు 17,100 టన్నుల గోధుమల్ని కేంద్రం పంపింది. ఆ మేరకే చెన్నై, జిల్లా కేంద్రాల్లోనికి వారికి కార్డుపై 5 కిలోలు, మిగిలిన ప్రాంతాల వారికి 2 కిలోల చొప్పున అందజేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## కొడైకెనాల్ రోడ్లపై అడవి దున్నల సంచారం



మెయిన్ రోడ్డులో సంచరిస్తున్న అడవి దున్నలు

పెరంబూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో పర్యాటకులు అధికంగా ఉండే కొలను రోడ్డులో పగలు, రాత్రి వేళల్లో అడవి దున్నల సంచారం అధికమైంది. ఈ రోడ్లపై చాలాసేపు నిద్రపోతున్న దున్నలు, అనంతరం సమీపంలోని ప్రైవేటు తోటలోకి వెళ్తున్నాయి. దున్నలు రోడ్డుపై ఉన్న సమయంలో పర్యాటకులు, వాహనాలు వెళ్లకుండా నిలిచిపోతున్నారు. పర్యాటక ప్రాంతాల్లోని అడవి దున్నల రాకను అడ్డుకొనేలా అధికారులు చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

## 8 మండలాలుగా ఎంటీసీ

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్వహణకు అనుకూలంగా ఉండేందుకు 8 మండలాలుగా విభజించారు. ప్రసుత్తం ఎంటీసీ 7 మండలాలుగా విభజింపబడి 32 డిపోలతో పని చేస్తోంది. ఈ 32 డిపోల్లో 30 వేలకు పైగా బస్సులు నడుస్తున్నాయి. అయితే రోజురోజుకు జనాభాకు అనుకూలంగా బస్సులు పెరుగుతుండడంతో నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. దీంతో మండలాలను 7 నుంచి 8కి పెంచాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు అడయార్, క్రోంపేట, వడపళని, అయనావరం, అన్నానగర్, తండయార్‌పేటతో పాటు ఆరు మండలాలతో పాటు ఉత్తర చెన్నై-దక్షిణ చెన్నై మండలాలను కూడా ఏర్పాటు చేశారు. దీని ప్రకారం అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ ఇంజనీర్ తదితర ఉద్యోగులను కూడా ఇక్కడకు బదిలీ చేస్తున్నారు.

## ఉదయనిధి టీషర్ట్‌పై పార్టీ గుర్తు వ్యవహారం...

## రెండు పిటిషన్లు తోసిపుచ్చిన హైకోర్టు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి డీఎంకే యువజన విభాగం చిహ్నం ముద్రించి ఉన్న టీషర్టులు వేసుకుని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన రెండు పిటిషన్లను మద్రాసు హైకోర్టు ధర్మాసనం శుక్రవారం తోసిపుచ్చింది. ఉదయనిధి డీఎంకే యు వజన విభాగం చిహ్నం ముద్రించిన టీషర్టులు ధరించి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనటం సచివాలయ ఉద్యోగులు, సేవకుల డ్రెస్‌కోడ్‌కు విరుద్ధమంటూ హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్, మరో న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ రామమూర్తితో కూడిన ధర్మాసనం ఎదుట గురువారం విచారణకు వచ్చింది. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఒకే అంశంపై ఎన్ని పిటిషన్లు వేస్తారంటూ పిటిషనర్లను ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఇదివరకే దాఖలైన పిటిషన్లపై విచారణ పెండింగ్‌లో ఉండగా మళ్ళీ అదే అంశంపై పిటిషన్లు వేయడం సబబేనా అని అడిగారు. పిటిషనర్లు ముందుగా దాఖలైన పిటిషన్ల లో మధ్యంతర పిటిషనర్లుగా చేరవచ్చని సూచించారు. వెంటనే పిటిషనర్లు తమ పిటిషన్లను వెనక్కి తీసుకుంటానడంతో ఆ రెండు పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది.

## తాంబరం నుంచి అదనపు బస్సులు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు అవసరాన్ని బట్టి తాంబరం రైల్వేస్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు అదనంగా 40 బస్సులను నడపనున్నట్లు ప్రభుత్వ రవాణా సంస్థ అధికారులు తెలిపారు. చెన్నై నగరం మధ్యప్రాంతాల్లో నివశించేవారు తాంబరం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా వుంది. ముఖ్యంగా తిరుచ్చి, సేలం, కళ్లకుర్చి, విరుదాచలం, తిరువణ్ణామలై తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ తాంబరం నుంచి 40 బస్సులు నడుస్తున్నాయి. అయితే పండుగదినాలు, వరుస సెలవుల సమయంలో అదనపు బస్సుల్ని నడుపుతున్నారు. అయితే ఇక్కడ బస్సుల్ని నిలపడం కష్టంగా మారడంతో కిలాంబాక్కం నుంచి తాంబరానికి అదనపు బస్సుల్ని రప్పించి, ఇతర ప్రాంతాలకు బస్సుల్ని నడపుతున్నట్లు అధికారులు తెలిపారు.

# పాంబన్ వంతెనపై హైస్పీడ్‌లో ట్రయల్ రన్



అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరంలో సముద్ర ఉపరితల రవాణా కోసం కొత్తగా నిర్మించిన పాంబన్ వంతెనను భారతీయ రైల్వే సేఫ్టీ కమిషనర్ ఏఎం చౌదరి సారథ్యంలోని నిపుణుల బృందం రెండో రోజైన గురువారం కూడా తనిఖీలు చేశారు. ఈ వంతెనపై హైస్పీడ్ రైలు నడిపారు. ఇక్కడ ఉన్న పాంబన్ పాత వంతెన స్థానంలో కొత్తగా దాదాపు రూ.550 కోట్లతో కొత్త వంతెన నిర్మించించారు. భారతీయ రైల్వే చరిత్రలోనే తొలిసారి వర్టికల్ లిఫ్ట్ విధానంలో ఈ వంతెన నిర్మించారు. అయితే, ఈ వంతెన దృఢత్వం, ఇతర నిర్మాణ పనులను సేఫ్టీ కమిషనర్ బుధవారం నుంచి క్షుణ్ణంగా పరిశీలిస్తూ అధ్యయనం చేస్తున్నా రు. ఈ వంతెన నిర్మాణం, పట్టాల అమరిక, సిగ్నల్ తదితర అంశాలల్లో ఉన్న లోటుపాట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. అలాగే, వంతెన వద్ద అమర్చిని లిఫ్ట్ వ్యవస్థ పనితీరు, భద్రతపై సమీక్ష చేశారు. అలాగే, ఇప్పటికే ఒకసారి వంతెనపై ట్రయల్ రన్ నిర్వహించగా, గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు మరోమారు హైస్పీడ్ వేగంతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ తనిఖీల తర్వాత వంతెన సేఫ్టీపై కమిషనర్ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ మార్గంలో రైళ్ళ రాకపోకలను ప్రారంభించనున్నారు.

## లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి జైలుశిక్ష

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేదింపులకు పాల్పడిన వృద్ధుడికి 17 సంవత్సరాల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ వేలూరులోని పోక్సో ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై తాలూకా అన్నానగర్ మేట్టుకాలనీకి చెందిన శేఖర్ (66) గతంలో వేలూరు కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికుడిగా పని చేసేవాడు. 2018లో అద్దె ఇంట్లో ఉండే శేఖర్.. పన్నెండేళ్ల తన స్నేహితుడి మనవరాలిపై లైంగిక వేదింపులకు పాల్పడ్డాడు. దీని గురించి ఆమె తల్లిదండ్రులకు చెప్పగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విచారణ పోక్సో ప్రత్యేక కోర్టులో జరిగింది. శేఖర్ లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో కోర్టు శిక్ష విధించింది.

● వైద్యుడిపై దాడి.....

## జీహెచ్‌లో ట్యాగ్ విధానం అమలు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుడిపై రోగి కుమారుడు కత్తితో దాడి చేసిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగా రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీహెచ్)లో ట్యాగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు వారి వెంట వచ్చే సహాయకుల చేతికి ట్యాగ్ కడుతున్నారు. అలాగే రోగి అడ్మిట్ అయ్యే సమయంలోనే ఎరుపు, నీలం రంగుల్లో ఉండే ట్యాగ్ కడుతున్నారు. ఈ ట్యాగ్‌పై పేరు, వయసు, వార్డు పేరు పొందుపరుస్తున్నారు. ఈ ట్యాగ్ ఉన్న వారిని మాత్రమే ఆస్పత్రిలోకి అనుమతిస్తున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ విధానాన్ని గురువారం నుంచి నిర్బంధం చేశారు. మరోవైపు, ఆస్పత్రిలో వైద్యుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ.. పీజీ వైద్య విద్యార్థులు, నర్సులతో కలిసి రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, వైద్య సేవలు అందిస్తున్నట్టు మద్రాస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, డీన్ తేరణి రాజన్ వెల్లడించారు. ఇదే విధానాన్ని ఒమందూరార్ ఆస్పత్రిలో కూడా అమలు చేస్తున్నారు.

## మత్తు మాత్రల స్వాధీనం

● ఇద్దరి అరెస్టు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయనావరం ప్రాంతంలో నిషేధిత ఎంటీఎంల్ మాత్రలను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 30 గ్రాముల గంజాయితో పాటు 167 ఎంటీఎంల్ మాత్రలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారు మత్తు మాత్రలను కొరియర్‌లో చేరవేస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది.

## లంచం తీసుకున్న హెచ్‌సీ సస్పెన్షన్

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నార్త్‌బీచ్ పోలీస్ స్టేషనులో శ్రీలంక తమిళ పౌరుడి నుంచి లంచం పుచ్చుకున్న హెడ్ కానిస్టేబుల్‌ను డిప్యూటీ పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈ పోలీస్ స్టేషనులో హెడ్ కానిస్టేబుల్‌గా కనకరాజజ్ (42) పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం మన్నడి ప్రాంతంలో విధుల్లో ఉండగా, ఆ సమయంలో అనుమానాస్పదంగా నిలబడిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆ వ్యక్తి శ్రీలంక తమిళ పౌరుడు మహ్మద్ అస్లాం (38)గా తేలింది. దీంతో భయపడిపోయిన అస్లాం తప్పించుకునేందుకు ప్రయత్నించగా, కనకరాజ్ వదిలిపెట్టలేదు. దీంతో రూ.1500 లంచం ఇచ్చి అక్కడ నుంచి అస్లాం నేరుగా డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి తనకు జరిగిన విషయాన్ని వివరించాడు. దీనిపై డీసీపీ తక్షణం విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్ లంచం తీసుకున్నట్టు తేలడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

## చిన్నారుల మృతి.. తల్లిదండ్రులకు అస్వస్థత

పెరంబూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుండ్రత్తూర్‌లో ఇంట్లో ఎలుకల బెడద అరికట్టేందుకు ఉంచిన మందు గాలిలో కలిసి నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు మృతిచెందగా, భార్యా, భార్తలు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మందు పెట్టిన గదిలో బుధవారం ఏసీ వేసుకొని గిరిధరన్ (34)పవిత్ర (31) కుమార్తె వైష్ణవి (6), కుమారుడు సాయిసుదర్శన్ (1) నలుగురు నిద్రపోయారు. ఏసీ చల్లదనంలో ఎలుకల మందు కలిసిన గాలి పీల్చినట్లు సమాచారం. చుట్టుపక్కల వారు వీరిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక వైష్ణవి, సాయిసుదర్శన్ మృతిచెందారు.

## ఎంపీ, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా కేసులు

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీ, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నమోదైన అవినీతి కేసుల ప్రాముఖ్యత గుర్తించి విచారణ చేపట్టాలని ప్రత్యేక న్యాయస్థానానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఎంపీ, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నమోదైన కేసుల పర్యవేక్షణ సుమోటా కేసుగా విచారించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుల్లో విచారణలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేపై ఉన్న కేసు వివరాలను నివేదికగా దాఖలుచేయాలని రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

## చెన్నై సెషన్స్ కోర్టుకు ఆమ్‌స్ట్రాంగ్ కేసు

పెరంబూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును ఎగ్మూర్ న్యాయస్థానం చెన్నై సెషన్స్ కోర్టుకు బదిలీ చేసింది. ఈ కేసులో అరెస్టయిన 27 మందిని గురువారం ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచారు. వారి రిమాండ్‌ను ఈ నెల 22వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, ఒక్కో ముద్దాయికి 5,000 , 27 మందికి 1.20 లక్షల పేజీలతో కూడిన ఛార్జిషీటు నకలు అందజేశారు.

## న్యాయవాదుల రాస్తారోకో

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్‌లో భాగ్యరాజ్ అనే న్యాయవాదిపై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని కోరుతూ జార్జిటౌన్ కోర్టు న్యాయవాదులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. న్యూ వాషర్‌మెన్‌పేటకు చెందిన న్యాయవాది భాగ్యరాజ్ అదే ప్రాంతానికి చెందిన సాజన్‌లాల్ మధ్య గత వారం జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. దీనిపై ఇద్దరి ఫిర్యాదులను స్వీకరించిన వాషర్‌మెన్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే న్యాయవాదిపై దాడికి పాల్పడిన సాజన్‌లాల్‌ను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడంతో జార్జిటౌన్ కోర్టు న్యాయవాదులు హఠాత్తుగా ఆందోళన చేపట్టారు. సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో న్యాయవాదులు ఆందోళన విరమించుకున్నారు.

## 1,200 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలో చట్టవిరుద్ధంగా గంజాయి విక్రయించిన రమేష్‌కుమార్‌ను గురువారం అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి 1,200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అన్నానగర్ ఎక్సైజ్ విభాగం పోలీసులకు అందిన సమాచారంతో విరుగంబాక్కం కామరాజర్ వీధిలో అనుమానాస్పదంగా నిలబడిన రమేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని, అతని నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న అనంతరం ఎగ్మూర్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

## పెట్రోలు పోసుకుని యువకుడి ఆత్మహత్య

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్ థర్డ్ అవెన్యూ ప్రాంతంలో గుర్తు తెలియని 25 యేళ్ల యువకుడు వంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని పరుగులు తీస్తూ అక్కడి స్కూలులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వళ్లంతా మంటలతో పరుగెత్తుకొచ్చిన ఆ యువకుడిని చూసి ఆస్కూలు పక్కనే ఉన్న హాస్టల్ విద్యార్థులంతా భయంతో పరుగులు తీశారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ సమాచారం అందుకున్న అశోక్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని గుర్తుపట్టలేనంతగా కాలిన స్థితిలో ఉన్న ఆ యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడి వివరాలను కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# నటరాజ్ హీరోగా 'ఎన్నై సుడుం పని'



'ఎన్నై సుడుం పని'
నటరాజ్ సుందర్‌రాజ్, ఉపాసన

'విశితిరు', 'ఎన్ కాదలి సీన్ పోడురా', 'వాగై' వంటి సినిమాల్లో నటించిన నటరాజ్ సుందర్‌రాజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎన్నై సుడుం పని'. ఉపాసన ఆర్‌సీ హీరోయిన్. ఎస్ఎన్ఎస్ పిక్చర్స్ బ్యానరుపై హేమలత, సుందర్‌రాజ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇతర పాత్రల్లో భాగ్యరాజ్, చిత్రా లక్ష్మణన్, మనోబాలా, తలైవాసల్ విజయ్, ముత్తుకాళై, సింగం పులి, తనీష్, సుందర్ రాజ్, బిల్లీ మురళి తదితరులు నటించారు. కథ, స్ర్కీన్‌ప్లే, మాటలు సమకూర్చి దర్శకత్వం వహిస్తున్న రామ్‌శేవ మాట్లాడుతూ, 'పక్క పక్కనే నివాసం ఉండే హీరో హీరోయిన్ల మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారుతుంది. ప్రతిరోజూ ఉద్యోగానికి వెళ్ళే యువతి పాత్రలో ఉపాసన నటించగా, రోజంతా జాలీగా తిరిగే తిరుగుతూ, ఐపీఎస్ పరీక్షకుల సిద్ధమవుతుంటాడు. ఈ నేపథ్యంలో పొల్లాచ్చిలో కొందరు మహిళలు కనిపించకుండా పోతారు. వారి ఆచూకీని పోలీసులు గుర్తించలేకపోతారు. ఒక మహిళ శవం రోడ్డుపక్కన లభిస్తుంది. ఆ మహిళ తల్లిదండ్రులు తమ బిడ్డ మృతికి న్యాయం చేయాలంటూ పోరాటం చేస్తారు. ఈ కేసు విచారణలో ఎవరూ ఊహించిన రీతిలో హీరోహీరోయిన్ల పేర్లు బయటకు ఎలా వస్తాయన్నదే ఈ చిత్ర కథ. సైకో, క్రైమ్, థ్రిల్లర్, సస్పెన్స్, లవ్ కోణాల్లో ఈ చిత్రాన్ని ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# హీరోలు అతీతులు కాదుగా?

## శృతిహాసన్



తాను ఫేస్ సర్జరీ చేసుకున్నట్టు జరుగుతున్న ప్రచారంపై హీరోయిన్ శృతిహాసన్ మండిపడ్డారు. తన ముఖారవిందాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు ఏదైనా చేసుకుంటానని, దాంతో మీకేం పని అంటూ ఘాటుగా ప్రశ్నించింది. అగ్రనటుడు కమల్ హాసన్ వారసురాలిగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆమె... ఇటీవలే తన ప్రియుడితో తెగదెంపులు చేసుకుని బ్యాచిలర్ జీవితాన్ని గడుపుతోంది అదేసమయంలో ఇంటర్నెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో ముచ్చటిస్తుంటారు. ఈ క్రమంలో ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫేస్‌సర్జరీ చేసుకున్నట్టు వచ్చిన వార్తలపై స్పందించారు. 'ముఖారవిందాన్ని మరింతగా పెంచుకునేందుకు ఫేస్‌సర్జరీ ప్రతి ఒక్కరూ చేసుకుంటారు. హీరోలు కూడా దీనికి అతీతులుకాదు. కానీ, వారిని మాత్రం పట్టించుకోరు. ఇపుడు నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. నా శరీర సౌందర్యం కోసం నేను చేయదలచుకున్నది చేస్తాను. అని ఘాటుగా బదులిచ్చారు. కాగా, శృతిహాసన్ ప్రస్తుతం 'సలార్-2', 'చెన్నై స్టోరీ'తో పాటు మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు.

చిత్రజ్యోతి

## యంగ్ దర్శకుడి గొప్ప మనసు

● డిస్ట్రిబ్యూటర్ల ప్రశంసలు



కవిన్‌తో నెల్సన్ దిలీప్ కుమార్

కవిన్ హీరోగా నటించిన 'బ్లడీ బెగ్గర్' బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఈ కారణంగా ఈ సినిమా కొనుగోలు చేసిన డిస్ట్రిబ్యూటర్లు భారీగా నష్టాన్ని చవిచూశారు. వీరిని ఆదుకునేందుకు ఆ చిత్ర నిర్మాత, ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ పెద్దమనసు చాటుకున్నారు. డిస్ట్రిబ్యూటర్లకు డబ్బులు తిరిగి చెల్లించేందుకు ముందుకు వచ్చినట్టు సమాచారం. 'బ్లడీ బెగ్గర్' మూవీ తమిళనాడు పంపిణీ హక్కులను ఫైవ్‌స్టార్ సెంథిల్ రూ.10 కోట్లకు కొనుగోలు చేయగా, కేవలం రూ.4 కోట్లు మాత్రమే వసూలు చేసింది. దీంతో రూ.7 కోట్ల మేరకు నష్టాలను చవిచూశారు. అయితే, నిర్మాత - డిస్ట్రిబ్యూటర్ మధ్య జరిగిన ఒప్పందంలో నష్టం వాటిల్లినా నిర్మాత డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్న కండిషన్ ఉంది.. అయినప్పటికీ నెల్సన్ దిలీప్ కుమార్ పెద్ద మనసుతో ఫైవ్‌స్టార్ సెంథిల్‌తో పాటు ఇతర డిస్ట్రిబ్యూటర్లను ఆదుకునేందుకు రూ.5 కోట్లు తిరిగి ఇచ్చేందుకు అంగీకరించినట్టు వినికిడి. దీంతో పంపిణీదారులు హర్షం వ్యక్తం చేస్తూ, నెల్సన్ దిలీప్‌కుమార్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారట. అదేసమయంలో ఈ చిత్రాన్ని నిర్మించినందుకు నెల్సన్ సంతోషంగానే ఉన్నారు. ఎందుకంటే శాటిలైట్ రైట్స్ విక్రయించడం ద్వారా ఆయన భారీగానే లాభాలను చవిచూసినట్టు కోలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

# మే డే రోజున రజనీకాంత్ 'కూలీ' ?



'కూలీ'లో రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ - యంగ్ సెన్సేనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'కూలీ' సినిమాను వచ్చే యేడాది కార్మిక దినోత్సవం రోజైన మే ఒకటో తేదీ విడుదల చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ విషయాన్ని తమ చిత్ర పంపిణీదారులకు నిర్మాణ సంస్థ సమాచారం ఇచ్చినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం సమకూర్చే ఈ మూవీలో సత్యరాజ్, ఉపేంద్ర, నాగార్జున, శృతిహాసన్ తదితర స్టార్ తారాగణం నటిస్తున్నారు. చాలా సన్నివేశాలను విశాఖలో చిత్రీకరించారు. ప్రస్తుతం చెన్నైలోని ఓ స్టూడియోలో కీలకమైన ఫైట్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఆ తర్వాత మరో ఫైట్, పాట చిత్రీకరిస్తే సినిమా షూటింగ్ మొత్తం పూర్తి కానుంది. ఈ సినిమా తర్వాత రజనీకాంత్ 'జైలర్-2'లో నటించనున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని కూడా సన్ పిక్చర్స్ నిర్మించనుంది.

# నేటినుంచి కబాబ్, బిర్యానీ ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో వంటకాన్ని పరిచయం చేస్తున్న నటి కోమల్ శర్మ

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని హోటల్ అంబికా ఎంపైర్‌లో శుక్రవారం నుంచి కబాబ్, బిర్యానీ, కర్రీస్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభమవుతోంది. ఈ ఫెస్టివల్‌కు గోట్ చిత్రం నటి కోమల్‌శర్మ గురువారం శ్రీకారం చుట్టారు. నోరూరించే మాంసాహార వంటకాలను పరిచయం చేశారు. సంగీత దర్శకులు శిర్పి, సత్యసి, మ్యూజిక్ కంపోజర్ స్వామినాథన్ రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 24 వరకు జరిగే ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో లంచ్, డిన్నర్ సమయాల్లో ఎగ్జిక్యూటివ్ చెఫ్ శ్రీధరన్, సాస్ చెఫ్ సహాయంతో తయారు చేసే హైదరాబాద్ చికెన్ బిర్యానీ, వెదురు బిర్యానీ, గులాబీ మటన్ సిక్కా కబాబ్‌లను కస్టమర్లకు అందించనున్నామని ఆ హోటల్ జనరల్ మేనేజర్ ఆర్ కాత్తినాదన్ తెలిపారు.




చెన్నై సత్యమూర్తి భవన్‌లో మాజీ ప్రధాని జవహర్‌లాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బాలబాలికలతో కలిసి నివాళులర్పిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మాజీ ఎంపీ కృష్ణస్వామి, సీనియర్ నేతలు




చెన్నై క్యాంపు కార్యాలయం నుంచి ఆర్థిక సలహాకమిటీ సభ్యులతో రాష్ట్ర ఆర్థికపరిస్థితులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

## కౌంటర్లలోనూ టిక్కెట్ల విక్రయం

● వండలూరు జూ అధికారుల దిద్దుబాటు




అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన వండలూరు జంతు ప్రదర్శనశాల ప్రవేశం కోసం కౌంటర్లలో కూడా టిక్కెట్లు జారీ చేస్తామని జూ అసిస్టెంట్ డైరెక్టర్ మణికంఠ ప్రభు తెలిపారు. వండలూరు జూకు సెలవు రోజైన మంగళవారం మినహా ప్రతి రోజూ వెయ్యి మందికిపైగా పర్యాటకులు వస్తుంటారు. ప్రవేశ రుసుంగా పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే, ఇటీవల ఆన్‌లైన్‌లో ఎంట్రన్స్ టిక్కెట్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టిక్కెట్లు పొందేలా ఏర్పాట్లు చేశారు. కేవలం స్మార్ట్‌ఫోన్లున్న వారికి మాత్రమే ఇది అనుకూలంగా ఉంది. ఈ క్రమంలో బుధవారం అనేక మంది పర్యాటకులు రాగా, వారిలో పదుల సంఖ్యలో పర్యాటకులకు సాధారణ మొబైల్ ఫోన్లున్నాయి. ఇలాంటి వారంతా నిరుత్సాహంతో తిరిగి వెళ్ళిపోయారు. పైగా ఈ ఆన్‌లైన్ విధానంపై పర్యాటకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయం జూ అధికారుల దృష్టికి వెళ్ళడంతో వారు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇదే విషయంపై అసిస్టెంట్ డైరెక్టర్ మణికంఠ ప్రభు మాట్లాడుతూ, ఆన్‌లైన్ టిక్కెట్ల జారీలో పర్యాటకులకు కలిగిన అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని గురువారం నుంచి కౌంటర్లలో టిక్కెట్లు జారీ చేస్తున్నట్టు తెలిపారు.



మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా గిండి కత్తిపారా కూడలిలో ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు దామో అన్బరసన్, ఎస్ఎం నాజర్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రాజా, రూబీ ఆర్ మనోహరన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు

# విశేషాలకు నిలయం బన్నారి అమ్మవారి ఆలయం



శూలాయుధాన్ని తలపిస్తున్న ధ్వజస్తంభం

## ● భక్తుల పాలిట కొంగుబంగారం ● అగ్నిగుండ ప్రవేశ ప్రత్యేక క్షేత్రం

అన్నపూర్ణగా, మహంకాళిగా, రాజరాజేశ్వరిగా, దుర్గాదేవిగా, మహామారియమ్మగా ఇలా వివిధ పేర్లతో కొలిచే ఆదిపరాశక్తి కొంగునాడు వాయువ్య సరిహద్దులో 'బన్నారిఅమ్మన్'గా ఇటు తమిళులు, అటు కన్నడిగులకు ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్నారు. ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం మైసూరు వెళ్లే మార్గంలో ఉన్న ఈ ఆలయంలో తామరపీఠంపై ఆశీనురాలైన అమ్మవారు చతుర్భుజాల్లో ఖడ్గం, కపాలం, ఢమరుకం, కలశం ధరించి ప్రశాంతవదనంతో దర్శనమిస్తున్నారు. ఆలయ ప్రాకారంలో మాతేశ్వర తిరుమూర్తి, తీర్థకొలను, వాటి సమీపంలో సరుకు మారియమ్మన్, వండిమునియప్పస్వామి తదితర దేవతామూర్తులు కూడా ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన లక్షలాదిమంది భక్తులు ప్రతియేటా ఈ ఆలయాన్ని దర్శిస్తుండటం మరీ విశేషం.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



ఆలయ ప్రవేశద్వారం



బన్నారి అమ్మవారు

### స్థలపురాణం..

మూడు శతాబ్దాల క్రితం ఈ ప్రాంతం అంతా దట్టమైన అడవి. దాని చుట్టూ పరిపాళయం, ఎమ్మానూరు, నంజైకవుండనూరు, కోక్కరై, తొట్టమలం అనే గ్రామాలుండేవి. ఈ గ్రామాల ప్రజలు పశువులను మేతకోసం అడవులకు పంపించేవారు. ఓసారిఆ పశువుల మందలోని ఓ కామధేనువు ప్రతిరోజూ మంద నుంచి విడిపోయి ఓ మర్రిచెట్టు దిగువ నేలపై పాలను స్రవింపజేస్తుండేది. రోజూ ఆ పశువు దూడకు కూడా పాలు ఇవ్వకపోవడం గమనించిన దాని యజమాని మరుసటి రోజు పశువులను మేతకోసం అడవికి తీసుకెళ్ళాడు. ఎప్పటివలెనే ఆ పశువు మర్రిచెట్టు దిగువ పాలను స్రవింపజేయటాన్ని చూసి యజమాని, మేతగాళ్లు విస్తుపోయారు. ఇదే దేవుడి లీలగా భావించి అందరూ కలిసి ఆ మర్రిచెట్టు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయసి, ముళ్లపొదలను తొలగించారు. పారతో మర్రిచెట్టు సమీపంలో భూమిని చదును చేస్తుండగా ఉన్నట్టుండి స్వయంభు లింగం బయల్పడింది. దాని సమీపంలోనే పెద్ద పుట్ట కూడా బయటపడింది. అదే సమయంలో ఆ గుంపులోని ఓ వ్యక్తికి పూనకం వచ్చి తాను కేరళలోని వన్నారక్కాడు (మన్నారక్కాడు) అనే ఊరి నుంచి పశువులను మైసూరుకు తోలుకెళ్లే ప్రజలకు మార్గదర్శిగా వెళుతూ మార్గమధ్యంలో ఈ ప్రాంతంలో పచ్చదనాన్ని చూసి మురిసిపోయి ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నానని, తనను బన్నారి అనే పేరుతో ఆరాధించమని తెలిపాడు. ఆ అమ్మవారి ఆదేశం మేరకు అక్కడ భక్తులంతా చిన్న పర్ణశాల నిర్మించారు. ఆ తర్వాత బన్నారి అమ్మవారికి ఆలయం కూడా నిర్మించారు. అమ్మవారికి పద్మపీఠంపై ఆశీనులైనట్టుగా విగ్రహాన్ని తయారుచేసి ప్రతిష్ఠించారు. ఈ అమ్మవారిని ఆరాధిస్తే సకల సంపదలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమావాస్య, ఆది, సోమ, మంగళ, శుక్రవారాల్లో ఈ ఆలయానికి వేలాదిమంది భక్తులు వస్తుంటారు. ఈ ఆలయంలో కుంకుమ, విభూతికి బదులుగా పుట్టమన్ను ప్రసాదంగా అందజేస్తున్నారు.



ఆలయ గోపురం

### ఆలయ వేడుకలు..

ప్రతియేటా తమిళ మాసమైన పంగుణిలో వచ్చే అమావాస్య తదుపరి వచ్చే సోమవారం నాడు ఉత్తరాషాఢ నక్షత్ర తిథి సందర్భంగా అమ్మవారికి పూలతో అలంకరిస్తారు. గురువారం పసుపునీళ్ల ఉత్సవం, అన్నదానం తదితర కార్యక్రమాలు చేస్తారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి దీప పూజలు జరుగుతాయి. ఈ ఆలయంలో జరిగే అగ్నిగుండ మహోత్సవం ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. ఆంగ్లేయుల కాలం నుంచి ఈ వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకలకు సమీప ప్రాంతాల్లోని అడవుల్లో చెట్ల కొమ్మలను నరికి తెస్తారు. ఈ కార్యాన్ని తమిళంలో 'కరుంబు వెట్టుదల్' అని చెబుతారు. ఈ అగ్నిగుండం వేడుకలకు అడవిలో కట్టెలను నరికేందుకు అటవీ శాఖ అధికారులు ఎలాంటి ఆటంకం చెప్పకుండా అనుమతిస్తుంటారు. ఇది ఆంగ్లేయుల కాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయమని భక్తులు చెబుతున్నారు. ఇక ఈ అగ్నిగుండంలో పత్తి, మిరప, ధాన్యాలు, కొబ్బరికాయలు వేసి నిప్పంటిస్తారు. ఈ అగ్ని గుండంలో భక్తులే కాకుండా పశువులు కూడా ప్రవేశించటం మరీ విశేషం. వేకువ జాము నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం రాత్రి ఆలయాన్ని మూసేంతవరకూ నిర్విరామంగా కొనసాగుతుంది. దేశవిదేశాల నుండి విచ్చేసే భక్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా అగ్నిగుండ ప్రవేశం చేస్తారు.



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న ఐఏఎస్ అధికారిణి పి.అముద

### ఆలయ వైభవం...

ఈ ఆలయంలో వినాయకుడు, బొమ్మరాయన్ అమ్మన్ అర్థమండపంలో వేర్వేరు సన్నిధుల్లో పూజలందుకుంటున్నారు. అంబికాదేవి ఆలయానికి దక్షిణ దిశగా వేదికపై మాతేశ్వర తిరుమూర్తి కొలువుదీరి ఉన్నారు. తీర్థకొలనుకు సమీపంలో పడమటి దిశగా ఉన్న ఓ చిన్న ఆలయంలో సరుగు మహా మారియమ్మన్ ఉన్నారు. అద్భుతమైన శిల్పకళా సౌందర్యంతో విరాజిల్లే రాజగోపురాన్ని దాటి వెళ్తే దక్షిణాభిముఖంగా బన్నారి అమ్మన్ భక్తులకు దర్శనమిస్తూ వారి కోరికలను నెరవేరుస్తున్నారు.



వినాయకుడి సన్నిధి

### ఎలా వెళ్లాలి?

కోయంబత్తూరుకు 70 కి.మీ.ల దూరంలో ఉన్న సత్యమంగళం ప్రాంతానికి చేరుకోవాలి. అక్కడ నుంచి మైసూరు రహదారిలో 15 కి.మీల వరకు టౌన్ బస్సులు, టాక్సీల్లో వెళ్తే బన్నారి అమ్మన్ ఆలయాన్ని చేరుకోవచ్చు. ఈరోడ్ నగరం నుంచి కూడా ఈ ఆలయానికి వెళ్లేందుకు బస్సులున్నాయి. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 9 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## విష్ణు సహస్రనామ మండలిలో తులసీ దామోదరుల వివాహం



తులసి వివాహంలో మండలి సభ్యులు

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని విష్ణు సహస్రనామ మండలి ఆధ్వర్యంలో తులసీదామోదరుల వివాహం గురువారం సత్తువాచారిలోని విఘ్నేశ్వరాలయంలో జరిగింది. ఈ మహోత్సవానికి మండలి అధ్యక్షుడు సత్యమూర్తి అధ్యక్షత వహించగా, వేలూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రాజా, కోశాధికారి రాజగోపాల్, వేలూరు విష్ణు సహస్ర నామమండలి కార్యదర్శి సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు. ఈ వివాహంతో పాటు తులసి అష్టోత్తరం, తులసి గాయత్రి నామం 108 సార్లు, తులసిదేవి నలుగు పాటలు, లక్ష్మీ అష్టకం వంటివి కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు చంద్రశేఖర్, జానకి జయరామన్, మీనాక్షి రాజగోపాల్, లలిత తదితరులు కూడా పాల్గొన్నారు.

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చెన్నైలో చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్న లాట్ చాకోపై నిర్వాహకులు





## ప్రయాణం.. నరక ప్రాయం

అసలే వర్షాలు.. పైగా మట్టి రోడ్డు.. బురదమయమైన ఈ రోడ్డులో ప్రయాణం సాగించేందుకు పెళ్లకూరు మండలంలోని యాలకారికండ్రిగ గ్రామస్తులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. చింతపూడి గ్రామం నుంచి యాలకారికండ్రిగకు చేరుకునే రోడ్డు వర్షం కురిస్తే బురదమయంగా మారుతోంది. వాహనదారులే కాకుండా పాదచారులూ ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, కనీసం గ్రావెల్, మెటల్ పరిచి కష్టాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

## శ్రీసిటీలో నీతి అయోగ్ సీఈవో

శ్రీసిటీ, నవంబరు 14: నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, పారిశ్రామిక వృద్ధి సామర్థ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల సీఈవోల సమావేశంలో సుబ్రమణ్యం మాట్లాడుతూ భారతదేశం అన్ని విధాలా వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో పరిశ్రమల వృద్ధి, స్థాపనకు అత్యంత అనువైనదంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా, యువత అందుబాటులో ఉందన్నారు. వారిని శ్రామికశక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉద్యోగ కల్పన, ప్రాంతీయ అభివృద్ధి, స్థిరమైన ఆర్థికవృద్ధికి కీలకమైన శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు నీతి అయోగ్ కట్టుబడి ఉందని సుబ్రమణ్యం స్పష్టం చేశారు. పరస్పర చర్చల సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభకు ప్రోత్సాహం, పరిశ్రమలకు సమీపంలో కార్మికుల నివాస గృహ సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను పరిశ్రమల ప్రతినిధులు లేవనెత్తారు. ఇందుకు సుబ్రమణ్యం సానుకూలంగా స్పందిస్తూ వీటిని కీలకంగా గుర్తిస్తూ విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.



సుబ్రమణ్యానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

# విలువిద్యలో 'మణిరత్నం'

విలువిద్యలో ఆ యువకుడు పట్టువదలని విక్రమార్కుడు. మధ్య తరగతి నేపథ్యమైనా ఇటు విద్యలోనూ అటు క్రీడాకారుడిగా రాణిస్తూ ప్రతిభ చాటుకుంటున్నాడు తరుమూరు గణేష్ మణిరత్నం. ప్రపంచ స్థాయిలో పతకమే లక్ష్యంగా గురి తప్పకుండా కృషి చేస్తున్నాడీ విలువిద్య క్రీడాకారుడు.

- తిరుపతి(క్రీడలు)



విలువిద్యలో పోటీపడుతున్న గణేష్ మణిరత్నం




ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలతో..

నాయుడుపేటలోని భరత్‌నగర్‌కు చెందిన తరుమూరు హరిప్రసాద్ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం. హరిప్రసాద్ సమీపంలోని టోల్‌ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడి ఆసక్తి గమనించి చదువుతో పాటు క్రీడా రంగంలోనూ ప్రోత్సహించాలని భావించారు. స్నేహితుల సలహాతో విలువిద్య(ఆర్చరీ)ను నేర్పించాలని సంకల్పించారు. 2016లో ఐదవ తరగతి చదువుకుంటున్న మణిరత్నాన్ని విలువిద్య కోచ్ శివశంకర్ దగ్గర చేర్పించారు. తండ్రి ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని కొన్ని నెలలకే విశాఖపట్నంలోని సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌లో శాప్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాడు. శాప్‌కోచ్ సుధాకర్‌నాయుడు దగ్గర రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నాడు. పదవ తరగతి పాస్ అయ్యాక భీమవరంలోని కోచ్ కమల కిషోర్ వద్ద శిక్షణ పొందాడు. మూడేళ్ల శిక్షణ కాలంలో జిల్లాస్థాయిలో పది స్వర్ణ పతకాలు, రాష్ట్రస్థాయిలో ఏడు బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకుని, అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. ఆర్చరీ గుర్తింపు సంపాదించాడు.




### ప్రపంచస్థాయి గుర్తింపే లక్ష్యం

వచ్చే ఏడాది నుంచి వరుసగా విలువిద్య వరల్డ్‌కప్, వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్, ఏషియా గేమ్స్ జరగనున్నాయి. వీటిలో తప్పకుండా ప్రాతినిధ్యం వహించి రాణిస్తాను. దేశానికి మంచిపేరు తీసుకురావడమే నా ముందున్న ప్రధాన లక్ష్యం.

- తరుమూరు గణేష్ మణిరత్నం

### విదేశాల్లోనూ సత్తా

- 2023లో ఐర్లాండులో జరిగిన యూత్ వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో అండర్-18కాంపౌండ్ విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇండియా నుంచి ఎంపికైన యువకుల్లో తొలిస్థానం సంపాదించాడు.
- ఈ ఏడాది జూన్‌లో సౌత్‌కొరియాలోని సువాన్‌లో జరిగిన ఏషియాకప్ స్టేజ్-3(వరల్డ్ ర్యాంకింగ్ టోర్నమెంట్)లో వ్యక్తిగతంగా ఐదవ ర్యాంకు, జట్టుతో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- ఈ ఏడాది సెప్టెంబరులో చైనీస్‌తైపైలో జరిగిన ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగతంగాను, గ్రూపులోనూ బంగారు పతకాలు సాధించాడు.



కుటుంబ సభ్యులతో..

## ప్రభుత్వమే 108 సర్వీసు నడపాలి

### ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వాలి



సమ్మె నోటీసు చూపుతున్న 108 ఉద్యోగులతో కిరణ్‌కుమార్

తిరుపతి(లీలామహల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహిస్తూ ఈఎంటీ, పైలెట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 108 సర్వీసు కార్పొరేటర్లకు వరంగా మారుతోందన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు రూ.300 కోట్లకు పైగా చెల్లించారని తెలిపారు. కాంట్రాక్టర్ మారిన ప్రతిసారీ ఉద్యోగుల జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఏ శాఖలోనూ లేనివిధంగా 108 సర్వీసులో రోజుకు రెండు షిఫ్టులుగా 12 గంటల చొప్పున పనులు చేయించుకుని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు షిఫ్టుల విధానంతో 8 గంటల చొప్పున పని విధానాలను మార్చాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఇంక్రిమెంట్లు లేవు, బోనస్‌లు లేకపోయినా విధులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో దుస్థితికి చేరిన 108 వాహనాలకు మరమ్మతులు చేయాలన్నారు. సిబ్బంది కొరత తీర్చాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలోనూ 108 అంబులెన్స్ సిబ్బందికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 25వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. సమావేశంలో మహేష్, సునీల్, మునిరాజ, కేశవులు, సుధాకర్, శ్రీదేవి, ఊహ తదితరులు పాల్గొన్నారు.

### 4 నుంచి ఎస్వీయూలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది. 4 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షల సమాచారాన్ని ఆయా కాలేజీలకు పంపినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

### జర్మనీ భాషపై శిక్షణ, ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎస్ఎం కేర్ సొల్యూషన్ సహకారంతో జర్మనీ భాషపై, నర్సింగ్ ఉద్యోగాల కల్పనపై శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం ఆవిష్కరించారు. జీఎన్ఎం బీఎస్సీ నర్సింగ్ కలిగి ఉండాలని, స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో ఆరు నెలల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని లోకనాథం తెలిపారు. మరిన్ని వివరాలకు 99888 53335ను సంప్రదించాలని తెలిపారు.

### సహకార వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న లక్ష్మి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారిణి లక్ష్మి మాట్లాడుతూ సహకార రంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణ, అధికారులు ఉమాపతి, నాగభూషణం, రవీంద్రనాథ్, పెంచలయ్య, బ్యాంకు మేనేజరు శ్రీదేవి, సురేష్, సహకార సిబ్బంది పాల్గొన్నారు.





పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ - దేవతామూర్తుల విద్యుత్ దీపాలంకరణ

## తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

తిరుచానూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి టీటీడీ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దేవతామూర్తుల కటౌట్లు, తిరుపతి నుంచి తిరుచానూరు వరకు విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఆలయ పరిసరాలతో పాటు గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. భక్తులు వేచి ఉండేందుకు నవజీవన్ ఆస్పత్రి సమీప ప్రాంతాలతో పాటు ప్రైవేటు, తోలప్పగార్డెన్ బస్టాండ్ల వద్ద ఇనుప షెడ్లు సిద్ధం చేస్తున్నారు. డిసెంబరు 6న బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థం జరగనుంది. ఈ ఉత్సవానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరిణిలో పాత నీటిని తొలగించి కొత్తవి నింపనున్నారు. తొక్కిసలాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్సవాల ఏర్పాట్లపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది.

## నకిలీ డాక్యుమెంట్లతో ప్రొఫెసర్‌కు టోకరా

- నలుగురిపై చీటింగ్ కేసు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గాజులమండ్యం పోలీసులు గురువారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సహదేవ్ తిరుపతి ఎమ్మార్‌పల్లిలో ఉంటున్నారు. రామచంద్రనగర్‌కు చెందిన సురేంద్ర, వెంకటసిద్దయ్య, వెంకటచెంచయ్య, భార్య రాజేశ్వరి కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. వీరందరూ 2015లో రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఎర్రంరెడ్డిపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 526/6ఏలో 170 అంకణాల విస్తీర్ణమున్న 4 ప్లాట్లను రూ.52 లక్షలకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలాన్ని గతేడాది కొనుగోలు చేసిన ప్రొఫెసర్ సహదేవ్ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు స్థలం వద్దకు వచ్చి పరిశీలిస్తుండగా చంద్ర అనే వ్యక్తి ప్రశ్నించాడు. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ప్రొఫెసర్ చెప్పడంతో స్థల యజమాని అవాక్కయ్యాడు. ఎవరో మోసం చేశారని ..విచారించుకోవాలని సూచించడంతో సహదేవ్ కంగుతిన్నారు. రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించారు. వారు సర్వే నిర్వహించి చంద్ర అనే పేరుపై రిజిస్టర్ అయిందని తెలపడంతో ప్రొఫెసర్ నిర్ఘాంతపోయారు. మోసపోయానని గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో పోలీస్‌స్టేషన్ల చుట్టూ న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదు. ఎస్పీ సుబ్బరాయుడుకు తాజాగా ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గురువారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అయింది.

## షార్‌లో ఘనంగా ప్రపంచ నాణ్యత దినోత్సవం

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బెంగళూరులోని హెచ్ఎస్ఎఫ్‌సీ డిప్యూటీ డైరెక్టర్ గీతాకృష్ణన్ మాట్లాడుతూ అన్ని విషయాల్లో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత గురించి తెలియజేసేందుకు ప్రతి ఏడాది షార్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం మంచిదన్నారు. భారత గగన్‌యాన్ కార్యక్రమంలో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ హమీద్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కనే హెచ్ఎస్ఎఫ్‌సీ డీడీ గీతాకృష్ణన్



సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న నెర్రి కాలువ నీరు

## సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీటికి మురుగునీరు తోడై రోడ్లపై పారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కార్యాలయం ముందు మురుగునీరు నిలబడింది. చెంగాలమ్మ ఆలయ సమీపంలోని సూళ్లూరు వద్ద నెర్రికాలువ నీరు వంతెనపై పొంగి ప్రవహిస్తోంది. మండలంలోని మంగళంపాడు, మంగానెల్లూరు దళితవాడల్లో వర్షపునీరు రోడ్లపై నిలబడడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. మంగానెల్లూరు దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు వర్షపు నీరు నిలబడి మడుగును తలపిస్తోంది. ఇక్కడ సీసీ రోడ్డు ఉన్నా వర్షపు నీరు పోయే దారిలేక ఆలయంలోకి చేరుతోంది.

### వెంకటగిరిలో మోస్తరు వర్షం

**వెంకటగిరిటౌన్ :** వెంకటగిరిలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షం పడడంతో చెరువులు, కుంటలు, కాలువల్లోకి నీరు చేరాయి.